# విమోచనం

(శ్రీ) కొడవటిగంటి కుటుంబరావు

నా పెళ్ళి విషయమై ఇతర్లు ప్రసంగించకుండా ఉంటే అది నిజంగా ఇం క్లిష్టసమస్య కాకపోను. ఎందుకంటే నేనావిషయం తలపెట్టరాదని ఎన్నోసార్లు తీర్మానించుకున్నాను. ఏ పదహారోయేటనో నాకు పెళ్ళిఅయి ఉంటే ఎంతో బాగుండిపొయ్యేది. కాని అట్లా జరగలేదు. అటు తరవాతకూడా కొంతకాలంపాటు నేను పెళ్ళి విషయం తీవ్రంగా ఆలోచిస్తూకూడా చేసుకోలేనిస్థితిలో ఉండిపోయినాను. ఆరోజుల్లో నన్ను పిల్చి నాకు పిల్లనిస్తామన్న మానవుడు లేకపోయినాడు. ఉన్న కాస్త ఆస్తీ పోయి యాభైరూపాయలమీద పెద్ద సంసారం ఈదుతున్నవాడికి పిల్లనివ్వటానికి కెవరొగబడతారు మరి?

ఇంతలో నాకు సరోజిని పరిచయం కలిగింది. సరోజినిని చూసిన తరవాత నా కింకొకర్ని పెళ్ళాడాలనే ఆలోచన అసాధ్యమయింది. ఆమెకి అంత ఆగ్రస్థానం ఎందుకిచ్చానో నేను చెప్పలేను. అంతకన్న అందమైనవాళ్లను చూసి ఉంటాను, అంతకన్న తెలివైనవాళ్ళనీ చూసివుంటాను. కాని నాకు మరే ఆడదీ అంత సమీపంలోకి మటుకు రాలేదు. నేను సరోజినికోసం తపించలేదు, విరహం పడలేదు, కలలు కనలేదు—సామాన్య ప్రేమికులు చేసేది ఏదీ చెయ్యలేదు. కాని అంతకంటె లక్షరెట్లు సన్నిహితమైన పనిచేశాను—ఆమెతో నా యిష్టాయిష్టాలూ కష్టసుఖాలూ చెప్పుకున్నాను. సరోజిని నా ఆత్మతో పరిచయం చేసుకున్నది. అంతకంటె ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు సమీపించటం ఎట్లాగో నాకు తెలీదు.

నే నేవస్తువులు ఇష్టపడి తింటానో, ఏ పుస్తకాలు ఇష్టపడి చదువుతానో, ఏరకం మనుషులతో మనస్ఫూర్తిగా మాట్లాడతానో, ఏ రకం హాస్యం ఆమోదిస్తానో సరోజినికి సమగ్రంగా తెలుసు. ఒక్కముక్కలో చెప్పాలంటే నన్నుగురించి ఆమెకు తెలియని విషయంలేదు.

అదీ కాక నా లక్షణాలనుగురించి సరోజిని ఎన్నడూ ఎటువంటి తగాదాకూడా చెయ్యలేదు. "అందుకే నిన్ను చూస్తే నాకు కోపం" అనే పద్ధతి ఆమె నా విషయంలో ఒక్కసారికూడా అవలంబించినట్టు నాకు జ్ఞాపకం లేదు. నన్ను ప్రత్యక్షాన ఎట్లాచూసేదో పరోక్షాన నన్ను గురించి అంతకంటె తక్కువచేసి మాట్లాడేదనుకోను... అనేకమందికి అపోహకూడా కలిగింది, ఆమెకు నామీద ఏదో మమకారం ఉన్నదని!

మూడోవిషయం ఏమంటే, నా పరిచయంవల్ల ఆమెలో ఏదో కొద్దిపాటి మార్పు కలిగిందని నా నమ్మకం. ఆ మార్పు ఆమెకుగాని ఆమె నెరిగినవారికిగాని అసంతృప్తి కలిగించలేదనికూడా నా విశ్వాసం. "వెనకటికన్న సరోజిని ఇప్పుడు చాలా నయంకాదూ?...సరదాగా మాట్లాడటం నేర్చింది!" అని ఒకరిద్దరు నా ఎదటే అనటం జరిగింది. ఆ మార్పుకు నేనే కారణమైతే ఎంత బాగుండునని చాలాసార్లనుకున్నాను. ఆఖరుకు అతిశయం పట్టలేక నేనే కారణమని తేల్చుకున్నానుకూడాను. ఆ విశ్వాసం నన్నిప్పటికీ వదలకుండా వుంది. నిజం దేవుడికి తెలియాలి.

ఏమయినా మా యిద్దరిస్నేహం గురించి ఇప్పుడు వివరాలు తవ్వటం అనవసరం. అందులో తప్పు పట్టేటందుకేమీ లేదు. దురదృష్టవశాత్తూ అందులో ప్రణయ లక్షణాలు—నేను పైనచెప్పినవి తప్ప—ఏమీ లేవు. "నేను సరోజినిని ప్రేమిస్తున్నాను" అనికూడా నా అంతరాత్మలో అనుకున్న పాపాన పోలేదు.

కాని అకస్మాత్తుగా ఈ భావం పైకి రావటానికి ప్రబలమైన కారణం ఏర్పడింది. సరోజినికి వరసగా రెండుమూడు సంబంధాలు వచ్చినై.

సరోజిని నన్ను పెళ్లిచేసుకోవాలని నేనెప్పుడూ అనుకోలేదు, ఆమెకి పై సంబంధాలు నా ఎదటే రావటానికి బదులు ముందుగా ఎవరైనా మాకిద్దరికీ పెళ్ళయితే బాగుండునని సూచించివున్నట్టయితే నా ఆలోచనని ప్రతిఘటించి ఉండేవాణ్ణేమోకూడానూ! ఎందుకంటే, నావంటి దరిద్రుణ్ణి పెళ్ళాడి సరోజిని ఏం బావుకుంటుంది? నా కా మనిషి మీద ఈ మాత్రమయినా ఇష్టంవుంటే నన్ను పెళ్లాడమని ఎట్లా అనగలను?

కాని అట్లా జరక్క నా ఎదటే ఎవరో సరోజినిని చూడరావటమూ, సరోజిని తన తల్లిదండ్రులతో ఆ వచ్చినవాడి మంచిచెడ్డలు తర్కించటమూ జరిగేసరికి నాలో ఏదో వింతవికారం కలిగింది. సరోజినికి నే నేమవుతాను? తన దారిన తను ఎవరినో పెళ్లాడి నా పరిచయాన్ని ఏం చేదామనుకుంటున్నది? ఇంకో ప్రాణియొక్క ఆత్మను అంత సులభంగా అవతలపెట్టెయ్యటానికున్నదా? ఉంటే నేను సరోజినిని అవతలపెట్టి మరెవరినో పెళ్ళాడటానికి నిశ్చింతగా ప్రయత్నం చెయ్యలేనా?...ఏ పిల్లనో చూడబోయి ఆమె అందచందాలను గురించీ, చదువుసంధ్యలను గురించీ నిశ్చింతగా చర్చించటం అసాధ్యమని నాకెందుకనిపించాలి?

...ఇంతకీ సరోజినికి ఆత్మ—"సోల్" అనే పదార్థం— లేదా? అంత సామాన్యపు మనిషా? అంత సామాన్యపు మనిషిని నేనింత పెద్దచేశానా?

"ఏం చదివితేమాత్రం, నెలకి డెబ్భై సంపాదన ఏం సంపాదన, నాన్నా?" అని సరోజిని అన్నమాటలు నా అంతరాత్మలో గులకరాళ్ళలే చేరి ఎంత మథించినా జీర్ణానికి రాకపోయినై!...యాభై సంపాదించుకునే నన్నుగురించి సరోజిని ఏమనుకుంటూ వుండివుండాలి?...నేను ఒకంతట పశ్చాత్తాపపడే ప్రాణినికాను. కాని సరోజినికి నా సంపూర్ణ పరిచయం—స్నేహం—ఇచ్చినందుకు నేను చెప్పతరంగాని బాధపడ్డాను. ఆమెవిషయమై వెనక ఎన్నడూ రాని ఆలోచనలన్నీ వచ్చినై. సరోజిని నన్ను పెళ్లాడటాని కెందుకు ప్రయత్నంచెయ్యదూ? నేను తక్కువ సంపాదిస్తూ ఉంటేనేం? నాతో అంత తృప్తి చెందినట్లు కనిపించిన మనిషి, డబ్బు కొంతవరకు త్యాగం చెయ్యకూడదా? ఎంత భాగ్యవంతుడు వచ్చినా తనకి లక్షాధికారి రాడుగదా! ఏ వందో సంపాదించేవాడు రావచ్చు. నాకోసం ఆపై యాభై త్యాగం చెయ్యకూడదా? తనని పెళ్లాడే వాడు ఏ రెండు వొందలలో సంపాదిస్తున్నాడని తెలిస్తే వాడి ఆత్మ ఎటువంటిదైనా పెళ్లాడేస్తుందా?... ఈ ఆలోచనల కంతే లేదు.

నాకు మరోసంగతికూడా తెలిసింది— నేను సరోజినిని ఇంతకాలమూ ఎంతో గాఢంగా ప్రేమించి వుండాలి. ఆమెమీద ఇంతకోపంగా వున్నాకూడా ఇంత విశాలప్రపంచంలోనూ నాకు సరోజినికంటె దగ్గిరిగా రాగల మరో ఆడది కనిపించలేదు. సరోజిని మరొకణ్ణి పెళ్లాడటం ఎంత రూఢో నేను ఆ జన్మ బ్రహ్మచర్యం అవలంబించటంకూడా అంత రూఢే అని తేలిపోయింది.

◆ ◆ ◆

చిత్రమేమిటంటే నేను మావూరు సరోజినినీ వొదిలేసి వెళ్ళిన సంవత్సరానిక్కూడా ఈ విశ్వాసం నాలో అట్లాగే ఉండిపోయింది. కాని సరోజిని కింకా పెళ్లి కుదరనేలేదు. ఆ విషయం నాకు పట్టలేదు. సరోజిని ఎవర్నయినా చేసుకోనీ, చేసుకోకపోనీ నన్ను మటుకు చేసుకోదు. ఆమెతో స్నేహం చేసినందు కెప్పుడయితే పశ్చాత్తాపపడ్డానో అప్పుడే మా ఇద్దరిమధ్యా వున్న బాంధవ్యం కాస్తా దగ్ధమైపోయింది, నేను చాలా అతిశయంగల జీవిని. నాలో ఒక మనిషి రెండుసార్లు పశ్చాత్తాపం తెప్పించనా? వొట్టిది!

నా కిప్పుడు ఒకటే ఆలోచన — సంపాదన. డబ్బే నాకు చుక్కాని. లంగరు లేనేలేదు. నెలకు రెండుమూడు వొందలు సంపాదించేవాళ్లు చాలా గొప్పవాళ్ళయితే నేను సంపాదనకోసం ఎక్కడికైనా వెళతాను. అవసరమైతే సముద్రాలు దాటిపోతాను. నన్నొకచోట బంధించేటందు కేమున్నది?

సముద్రంవొడ్డుకిపోతే గాగిచిప్పలు కావలసినన్ని. డబ్బు సంపాదించటం కష్టంకాదు—అదే ఆశయంగా పెట్టుకుని, మిగతా విషయాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా ఉంటే! పట్నం చేరాను. మనుషుల్ని ఆశ్రయించాను. ఏర్లు దాటి తెప్పలు కాల్చాను. మనుషులకి వేరే విలువలు చూడలేదు. ఏరుదాటే తెప్ప అవునా కాదా అని తప్ప. ఓ సంవత్సరం తిరిగేటప్పటికి ఓ వెయ్యి బాంకులో నిలవచేశాను. నెల నెలా రెండువందల యాభై అందుతున్నై.

ఆనందమా? తృప్తా? అటువంటిదేమీ లేదు. యథార్థం చెప్పాలంటే ఈ మహా పట్టణంలో నేను పొందిన ఆనందమంతా కలిపితే సరోజినితో ఒక్క గంట గడిపిన తృప్తితో సమాన మవుతుందని నాకు నమ్మకం లేదు. కాని సరోజిని స్నేహానికి జరిగిన పరాభవం చూస్తూ ఆ తృప్తిని గురించి


# అనాస్ క్యూర్

అందరకు అందుబాటులో నుండుటకు ధరలు తగ్గించడమైనది.

మా 'అనాస్ క్యూర్' చంటిపిల్లల అన్ని జబ్బులకు అమోఘముగ పనిచేయును. పిల్లలు పాలుకక్కుట, కడుపునొప్పి, విరోచనము బద్దలుగా అగుట, శరీరముపైని పొక్కులుపొక్కుట, తలపైకి కురుపులు పుట్టుట, మొదలగు గుణములు కలిగియుందురు. చంటిపిల్లలకు యేవిధమైన జబ్బులు వచ్చినా "అనాస్ క్యూర్" వాడిన తప్పక గుణమిచ్చును. చనుపాలతో అరగతీసి ఆముదములో కలిపి చంటిపిల్లలకు పట్టినయెడల మీ పిల్లలకు జబ్బు జీవితపర్యంతం రాకుండా కాపాడు కల్పతరువు.

మందు వెల రు. 1—0—0

పోస్టేజి ప్రత్యేకం.

వివరములకు:

## వానమామల జియ్యన్నస్వామి

గొలిపట్నం, చోడవరం పోస్టు, విశాఖపట్నం జిల్లా.

ఏమని తృప్తిపడను? అనుభవాన్ని ఎట్లా తృణీకరించను? ఆ తృప్తిని గురించి తలుచుకోవటానికి ప్రయత్నించినప్పుడల్లా నాకు జ్ఞాపకం వస్తున్నది పరాభవమే. అది నన్ను వెన్నంటి వదలకుండా ఉంది.

కొంత ఆత్మోపశాంతి చేసుకుందామనే ఉద్దేశంతోటే సరోజిని తండ్రికి ఒక ఉత్తరం రాశాను: నా సంపాదన గురించి రాస్తూ, డబ్బున తిట్టాను. దానికల్ల మనశ్శాంతి లేదన్నాను. సరోజినికి తెచ్చే మొగుణ్ణి కేవలం డబ్బు మాత్రమే చూసి నావంటి ఆత్మశాంతి లేనివాణ్ణి తీసుకు రావద్దన్నాను.

ఈ ఉత్తరానికి సరోజిని స్వయంగా సమాధానం రాస్తూ నేను బాగా సంపాదించుకుంటున్నందుకు తనకు చాలా సంతోషంగా ఉన్నదనీ, నాకు అర్థమైన సంపాదన లేనందుకు వెనక తనకెంతో కష్టంగా ఉంటూ ఉండేదనీ, దారిద్ర్యం ఎరిగి ఉండికూడా నేను డబ్బును తృణీకరించటం తనకు నచ్చలేదనీ, తను పెళ్లాడితే తప్పకుండా నావంటి వాడినే పెళ్లాడుతుందనీ, ఆత్మశాంతి నాకు లోపించిన పక్షంలో నాకు తగిన ఆడదాన్ని పెళ్ళాడితద్వారా తెచ్చుకోవచ్చుననీ, డబ్బును తిట్టనవసరం లేదనీ బోధించింది.

ఆ ఉత్తరం చూసి నే నేమనుకోను? ఎండిపోయిన చెట్టు చిగిర్చినట్టయింది. మళ్ళీ నే నెరిగిన గొంతు వినిపించింది. సరోజినిని నే నపార్థం చేసుకున్నా నేమోనని అనుమానం కలిగింది. ఆలోచించిన కొద్దీ అనుమానం హెచ్చిందే గాని తగ్గలేదు. సరోజిని నాకు చేసిన అపకార మేమిటి? ఆమె పెకేమంటేనేం? ఎవర్ని పెళ్ళాడింది? ఎవర్నీ పెళ్లాడలేదు. నేను తనని పెళ్ళాడటానికి సిద్ధంగా ఉన్నానని తెలిసే — నేను నోరు చేసుకుని అడిగి ఉంటే — నన్ను పెళ్ళాడేదేమో? నే నెందుకంత తొందరపడ్డాను? వెనక నాకై నేను ఆమెను పెళ్లాడతా ననక పోవటానికి కారణం ఉంది — దారిద్ర్యం. ఇప్పుడది అంతగా లేదుగ? ఇప్పుడు మించిపోయిందేమిటి? ఇప్పుడెందుకడగరాదూ?

కూచుని సరోజినికి ఎంతో ప్రేమపూర్వకంగా ఉత్తరం రాశాను. కవరుమీద ఎడ్రసుకూడా రాశాను. ఉత్తరం తిరిగి చదువుతుండగా భయంకరమైన అనుమానం మరొకటి తల ఎత్తింది?

నేను దారిద్ర్యంలో వున్న రోజుల్లో సరోజిని నావంటి వాణ్ణే తప్పక పెళ్ళాడతానని సూచనగానైనా నాతో ఎందుకనలేదూ? అప్పటికీ ఇప్పటికీ నాలో ఏదో తేడా వుండబట్టేనా? అది నా ఇప్పటి అప్పటి ఆర్జనలు తేడా ఏనా?

నా ఉత్సాహమంతా భగ్నమయింది. నేను రాసిన ఉత్తరం చించేశాను. నా అశాంతి పదింతలయింది. నేను వెనక హృదయంలో పెట్టుకుని తిరిగిన సరోజిని ఏమయింది? ఆ సరోజినికి బదులు ఈ సరోజిని ఎక్కణ్ణించి ఊడిపడింది. ఈ సరోజినిని ఆకర్షించిన నాజీతంమీదా నేను చేసే అర్థం లేని వుద్యోగంమీదా రోత పుట్టింది...... నేనింత దూరం వచ్చి డబ్బు సంపాదించటానికింత శ్రమపడింది ఈ సరోజినిని ఆకర్షించటానికేనని నా కిప్పుడు తోచసాగింది. నా ప్రయత్నం సఫలమయింది. సరోజిని నన్నిప్పుడు నమ్మకంగా పెళ్లాడుతుంది! కాని నాకు సంతృప్తి కలగలేదు. పైపెచ్చు ఈ సరోజిని ఎదట కనిపిస్తున్న కొద్దీ నేను వెనక ఎరిగిన సరోజినికోసం ప్రాణం పీకసాగింది. ఆమె కోసం ఎక్కడ వెతగను?

◆ ◆ ◆

ఈ విధంగా నేను బాధపడుతున్న సమయంలో నాకు పెళ్లి చెయ్యాలని చాలామంది పట్టుపట్టినట్టు విశదమయింది. అంతా కూడ బలుక్కున్నట్టు అనేకమంది బంధువులూ స్నేహితులూ నాకు సంబంధాలు తీసుకు రాసాగారు...


# ఆతంకనిగ్రహ మాత్రలు

దేనికి వినియోగపడునో మీకు

తెలియునా?

వీర్యనష్టము, అకాలములోనే నీరసము, శరీర, మానసిక దౌర్బల్యము, గుండెదడ, ఆకలి లేకపోవుట, మలబద్ధకము, అజీర్ణము మున్నగు దోషములనీ మాత్రలు నిర్మూలించును.

పైన ఉదాహరించిన దోషములతో మీరు బాధపడుచున్నారా? అటులైన యీ మాత్రలు సేవించి బాధ నివారణ చేసుకొనుడు.

ఒకసారి వాడి, సంతృప్తినొందుడు.

32 మాత్రల డబ్బీ ఖరీదు రు. 1-4-0.

ఆతంకనిగ్రహ ఫార్మసీ,

26, బ్రాడ్వే మదరాసు.

ఏజంట్లు:—

శ్రీనివాస మెడికల్ స్టోర్సు, పార్కురోడ్డు, బెజవాడ

నీలం అండ్ కో., మెయిన్ రోడ్డు, విశాఖపట్టణము

ఆర్. వి. యస్. శర్మ, రాజమహేంద్రవరము.

ఒక్కసారిగా ఒక డజనుమంది సరోజినులు—నాకక్కర్లేని సరోజినులు — వెంటపడ్డట్టయింది.

"ఎవరో ఒకర్ని పెళ్ళిచేసుకుని నలుగురితోబాటే కాలం వెళ్లబుచ్చు. నీ ముష్టి రెండువందల యాభై రూపాయల వుద్యోగం గురించి ఇంత మథనపడకు," అని అంతరాత్మ హెచ్చరించ సాగింది.

"నీ సరోజిని ఎక్కడో వుంది. వెతికి పట్టుకో. నలుగురితోపాటే అనుకుని అందరూ దిగే బురదగుంటలో దిగకు. నీ వ్యక్తిత్వంచే జేతులా పారేసుకోకు," అని మరోవంక బుద్ధి మందలిస్తూ వచ్చింది.

ఈ సందర్భంలో సత్యనారాయణగారు ఒక సంబంధం తెచ్చారు. ఎవరో బీదవాళ్ల పిల్లట. చాలా బుద్ధిమంతురాలట. పనిపాటలు బాగా వచ్చుట. "నువ్వు చేసుకుంటే చాలా సుఖపడతావు, ఆ పిల్ల తలిదండ్రులకీ మహోపకారం చేసినవాడి వవుతావు......నీకు వుద్యోగం లేకపోయినా నీవంటి సంబంధం వాళ్లు తీసుకు రాలేరు. అంత బీదవాళ్లు, పాపం. నిన్ను కళ్ల కద్దుకుంటారు..." అన్నా రాయన.

మిగిలిన బంధు మిత్రు లందరి శిఫార్సులూ పెడచెవిని బెట్టిన నేను సత్యనారాయణగారి మాటలు ఆలకించాను. ఆయన భాష నాకెప్పుడూ అర్థమవుతుంది. ఆయన చాలా వుత్తముడు.. ఆయనతో పరిచయం లేకపోతే ఈ పట్టణం నాకు దాదాపు అరణ్యమే.



'కిస్మత్ వాలా'లోని ఒకదృశ్యం.



'చంపా'లో ఒకదృశ్యం

కాని ఆ బీదపిల్లని చేసుకుంటానని సత్యనారాయణగారి కెట్లా మాట ఇవ్వను ? ఆ పిల్లని చేసుకోవటానికి ఒకటే అభ్యంతరం—నేను పోగొట్టుకున్న సరోజిని! ఆ సరోజినిని పట్టుకోవటానికి నేను ఏమాత్రమైనా ప్రయత్నించవద్దా ? ఎట్లా ప్రయత్నించను ?

ఆలోచించగ, ఆలోచించగా ఒక మార్గం దొరికింది.

◆ ◆ ◆

నన్ను చూసి సరోజిని చాలా సంతోషం కనబరిచింది. ఏదో వుద్రేకం దాచటానికల్లే వసపోసిన పిట్టలాగా ఊపిరి తియ్యకుండా మాట్లాడింది. ఆఖరుకు మాటల సందర్భంలో ఏ పనిమీద వచ్చాననేదీ ఎంతకాలం వుంటాననేదీ ఆమె నోటంట దొర్లినై.

పెళ్ళి చేసుకునేటందుకని వచ్చానన్నాను. ఎవరి నన్నది.

"చేసుకుంటే నిన్నయినా చేసుకుంటా" నన్నాను.

"నేనే ఏమిటి ? చేసుకోదలిస్తే నాకన్న మంచివాళ్ళే దొరుకుతారు," అన్నది సరోజిని.

"నాకు నువు చాలు," నన్నాను. "అయినా పట్నంలో వుద్యోగం చేస్తుండగా ఎవరైనా దొరికేవాళ్ళేమో గాని ఇప్పు డెవరు దొరుకుతా," రన్నాను.

సరోజిని వులిక్కిపడింది ఏమిటి, వుద్యోగం పోయిందా అన్నది.

"నేనే వదిలేశాను" అన్నాను.

ఎందుకన్నది.

"చూడు, సరోజినీ. నేను నిన్నే పెళ్ళి చేసుకుందా మని గట్టి తీర్మానంతో వచ్చాను. నువు నన్ను వుద్యోగం కోసం చేసుకుంటున్నా వనేది నన్ను బాధించకుండా వుండ గలందులకు వుద్యోగం వదలేసి వచ్చాను," అన్నాను.

సరోజిని మొహం జేవురించింది.

"అయితే నాలో అంత నమ్మకం లేదా ?" అన్నది.

"నాలోనే నమ్మకంలేదు. నావంటి వాణ్ణి నువు చేసు కుంటావని నమ్మకం లేకనే ఈ పని చేశాను," అన్నాను.

"వుద్యోగం మానెయ్యకుండా వస్తే ఆ వుద్యోగం చూసి ఒప్పుకుంటాననేనా మీ భయం ?" అన్నది.

"ఆ భయం నువు ఈ క్షణాన తీర్చవచ్చు. నన్ను పెళ్లి చేసుకుంటావా ?" అన్నాను.

"క్షమించండి. నాలో నమ్మకం లేనివాళ్ళని ఎట్లా చేసుకోను ?" అంటూ లేచి వెళ్ళిపోయింది.

నేను ఆమెను నిలిపి, "అన్నీ వొట్టిదే. వుద్యోగం పోలేదు, ఏమీ పోలేదు. వేళాకోళాని కన్నాను, అన్నాను.

తక్షణమే ఆమె మొహం మారింది.

"మీదంతా విచిత్రమైన హాస్యం.... పెళ్ళి కెన్నిరోజులు శలవ తీసుకున్నారు ?" అన్నది.

"వారం రోజులు," అన్నాను.

"అంటే ? అప్పుడే రెండు రోజులైపోయినాయి గదా? ప్రయత్నాలు చేసుకోవద్దా? ముహూర్తం పెట్టుకో వద్దా ? ఏదీ వ్యవధానం ?" అన్నది.

"ప్రయత్నా లేమీ లేవు...వాళ్ళు, పాపం, చాలా బీదవాళ్లు. ఏదో ముహూర్తం వుందని చెప్తారు. దానికి చేసెయ్యమంటే చేసేస్తారు," అన్నాను.

పాపం, సరోజిని మొహం సున్నం కొట్టినట్టయింది.

"ఎ—ఎ—ఎవరు—వాళ్లు ?" అన్నది.

చెప్పాను, వీలుంటే పెళ్లికి రమ్మని ఆహ్వానించాను.

సరోజిని నాకేసి చూళ్లేక పోయింది, తల వంచుకుని పిలుస్తున్నా పలక్కుండా వెళ్లిపోయింది.

నా మనస్సు కుదటపడింది. ప్రశాంత హృదయంతో ఆ సాయంకాలమే నా కాబోయే అత్తవారూరు ప్రయాణ మైనాను.




లక్ష్మి బ్రాండ్

జామా ఆయిల్ (రిజిస్టర్డ్)

ఘాటైన వాసనకు వాడండి

జలుబు, జ్వరము, తలనొప్పి వీటికి దివ్యౌషధం

వివరాలకు :

అమర్‌చంద్ శోభాచంద్

కెమిస్టుస్ అండ్ డ్రగ్గిస్టుస్

95, నైనియప్ప నాయకన్ వీధి, పి. టి. మద్రాసు.